# ఆర్ట్ ఎటాక్

ముకుందరావు పోయాక – ఏదో మామూలు దినపత్రిక నాలుగో పేజీలో ఓ మూల చిన్నవార్త పడింది. "ప్రముఖ టైర్ల వ్యాపారస్తుడు. ముకుందరావు నిన్న ఉదయం హఠాత్తుగా మరణించాడు. ఆయన వయస్సు 50 సంవత్సరాలు. ముకుందరావు టైర్లకంపెనీ మేనేజర్‌గా గత మూడు దశాబ్దాలుగా పేరు గడించాడు. ఆయనకి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయనకు లలితకళలంటే ఎక్కువ ఆసక్తి".

ఈ ప్రకటన న్యాయంగా పత్రికలో వెయ్యనక్కరలేదు. కాని ఆ పత్రిక సంపాదకునికీ, ముకుందరావుకీ పాతిక సంవత్సరాలుగా దోస్తీ. ఈ పాతికేళ్ళలో ఆయన కారు టైర్లు ఎప్పుడు పాడయినా సరసమయిన ధరలకి ముకుందరావు టైర్లు సప్లయి చేశాడు. కృతజ్ఞత చూపడం ఆ సంపాదకుని బలహీనత కాగా, నాలుగో పేజీలో ఆ చిన్న వార్త ప్రకటించడం వల్ల దేశానికి లాభం మాట ఎలా ఉన్నా, పత్రికకు నష్టం లేదు. చదివిన వారు చదువుతారు. అందుకని ప్రచురించాడు.

ముకుందరావు చావుని సమాజం గుర్తించిన తీరు అది.

* * * * *

ఇరవైమూడో సంవత్సరంలో ముకుందరావు తనకంటే రెండేళ్ళు చిన్నదయిన సీతను పెళ్ళి చేసుకున్నప్పుడు గర్భాదానం గదిలోనే ఆవిడకి చెప్పాడు "లుక్. నాకు యిది రెండో పెళ్ళి. మొదటి భార్యని అయిదేళ్ళ క్రిందటే పెళ్ళి చేసుకున్నాను" అని. సీత నిర్ఘాంత

పోయింది. భయపడి ఆకులా వణికిపోయింది. "నా మొదటి భార్య పేరు 'కళ', కళలేనిదే నాకు నా జీవితం లేదు. ఆర్ట్ తర్వాతే నువ్వు" అన్నాడు. షాకు నుంచి తేరుకుని నిట్టూర్చింది. పరిహాసంగా అన్నాడనుకుని సీత నవ్వుకుంది. కాని తర్వాత అతను చెప్పిన మాటల్లో నిజం గ్రహించింది.

ముకుందరావు పద్దెనిమిదో ఏట, క్రోటన్ మొక్కల నీడలో కూర్చుని సాయంకాలం వేళ కుంచె, రంగులు దగ్గర పెట్టుకుని బొమ్మలు వేసే రంగనాథరావు ఎక్కువ ఆకర్షించాడు. ఆర్మీలో 16 ఏళ్ళు పనిచేసి పెన్షన్ తీసుకొని, భార్య టీచర్‌గా చేస్తోంది కనుక ఇంటి బాధ్యతలు అట్టేలేవు. కనుక తీరికని ఏదో విధంగా భర్తీ చేయాలి. కనుక కుంచె పట్టుకున్న అదృష్టవంతుడు రంగనాథరావు. అతనికి ఆర్టుకంటె, అది అతని జీవితానికి యిచ్చిన 'పికప్' ముకుందరావుకి నచ్చింది. చాలా రోజులు మదనపడి ఓ మంచి రోజున తనూ కుంచెలూ, రంగులూ కొని తెచ్చాడు. అదే అతని కళాజీవితానికి ప్రారంభం. అంతకు ఆరునెలల ముందే "టైర్లు" అతని జీవితంలో ప్రవేశించాయి. వాళ్ళ నాన్నగారు టైర్ల కంపెనీలో పనిచేసే మిత్రుడికి చెప్పి చిన్న ఉద్యోగం వేయించాడు. కాని సాయంకాలం వేళల్లో పట్టుదలగా కుంచె, రంగులతో కృషి అతని కార్యక్రమం అయిపోయింది.

ఏ కళయినా పర్యవసానాన్ని ఆశించి జరిపితే ఆ మేరకు దాని స్థాయి తగ్గిపోతుంది. కళకి లక్ష్యం కనీసం సాధన స్థాయిలోనైనా కళే కావాలి. అది సాధించే పర్యవసానాన్ని కళాకారుడి వ్యక్తిత్వం దరిమాలాను నిర్ణయిస్తుంది. ఈ సత్యం ముకుందరావుకి తెలీదు. తెలుసుకోవాల్సిన అవసరం లేదు. కాని విచిత్రంగా ఏ ప్రయోజనాన్ని ఆశించీ ముకుందరావు కళని ఆరాధించక పోయినా అతని కళ చెప్పుకోదగిన స్థాయికి ఎప్పుడూ పెరగలేదు. చాలా సంవత్సరాల పాటు అతని మిత్రులకీ, అతని చుట్టూ ఉన్న సమాజానికీ ఆ కళ పరిమితమై పోయింది.

ఒకసారి అతని బాల్యమిత్రుడు ఇంటికి వచ్చినప్పుడు యింట్లో వార్నిష్ వాసన గుప్పుమంది. అప్పుడు అతని అసలు రంగు బైటపడింది. ఆ మిత్రుడు కళని ఏవిధంగా పదిమందికి చాటవచ్చునో చెప్పాడు. అప్పట్నుంచీ చాలా పత్రికలకి, సంస్థలకీ ముకుందరావు తన చిత్రాలన్ని పంపడం ప్రారంభించాడు. అవి ఏవేవో లక్ష్యాల్ని సాధించాలని అతను ఏనాడూ ఆశించలేదు. అతను ఆశించలేదన్న విషయం పత్రికలూ, సంస్థలు గుర్తించాయి. అతని పెయింటింగులన్నీ ఎప్పటికప్పుడు వెనక్కి తిరిగి వచ్చేవి. అందుకు విచారింలేదు ముకుందరావు. కాని యుద్ధంలో ఎదురు దెబ్బతిన్న సైనికుడికి పెరిగే పౌరుషం లాంటిదేదో ముకుందరావుకి కలిగింది. మరింత సాధన పెంచాడు. జీవితంలో కష్టపడి డబ్బు మిగిల్చి ఆర్టు మీద పెద్ద పెద్ద గ్రంథాల్ని తెప్పించి రాత్రింబవళ్ళు పఠించాడు. రెంబ్రాంట్, గాగిన్, గోయా, పికాసో వంటి మహానుభావుల జీవిత చరిత్రలు తెలుసుకున్నాడు. చిన్నచిన్న మిత్ర బృందాలకు వాళ్ళ గురించి అనర్గళంగా మాట్లాడేవాడు. అయితే అతని ప్రసంగానికి రావలసిన రాణింపు రాకపోవడానికి కారణం – ఆ మిత్రులకి అతని మీద తప్ప, అతని ఆర్ట్ మీద ఆసక్తి

లేకపోవడం. ఏమయినా ముకుందరావు గురించి తెలిసిన వాళ్ళూ, అతని ఆర్ట్‌పట్ల గల పట్టుదల తెలిసిన వాళ్ళు అతని మనస్సు నొప్పించకుండా ఉండేందుకు అతను చెప్పేది విని, అతను చూపించేవన్నీ చూసి లొట్టలు వేసేవాళ్ళు.

కొన్నాళ్ళకి ఆర్టు వల్ల మొదటి లాభం ముకుందరావుకి దక్కింది. ఆ లాభం అతని జీవితాన్నే మలుపు తిప్పింది. వరస తప్పకుండా పోస్టు బంగీలు తిరిగి వస్తున్నా - విసుగూ విరామం లేకుండా కృషి చేసే అతని గొప్పతనాన్ని పోస్టు మాన్ మాణిక్యాలరావు సంవత్సరాల తరబడి చెప్పగా చెప్పగా విని అతని కూతురు సీత అతన్ని ప్రేమించింది. (లేక అతని పట్టుదలనా?) అతను క్రమం తప్పక అన్ని సంవత్సరాలు ఫెయిల్ అవడంలోనూ ఒక క్రమశిక్షణను కనిపెట్టిన ఆమె అతని వ్యక్తిత్వాన్ని మెచ్చుకుంది. ఆ విధంగా కళవల్ల అతనికి దక్కిన మొదటి లాభం, అతని భార్య, మొక్కవోని ఏకాగ్రత, ఫలితం ప్రమేయం లేకుండా చేసే సాధన కూడా "కళ" అయితే ముకుందరావు జీవితంలో కళ సాధించిన మొదటి విజయం అది.

ముకుందరావు ఉద్యోగంలో ప్రమోషన్లు వచ్చే హెడ్డు, సెక్షన్ సూపరింటెండెంటు, చివరికి మేనేజరూ అయ్యాక అతనికీ భక్తులు పెరిగారు. వాళ్ళ భక్తి అతని ఆర్టు మీద కాదు. అతని హోదా మీద. అతని ఆఫీసులో గుమాస్తాలకు తీరికవేళల్లో ఆర్టు గురించి చెప్తే వాళ్ళు అతిభక్తితో చెవులొగ్గి వినేవారు. అవకాశం వదలిపెట్టక అతని ఆర్టుని మెచ్చుకునేవారు. ఆర్టుని మెచ్చుకోవడం కూడ వాళ్ళ ఉద్యోగ విధుల్లో ఒక భాగమని, దానివల్ల ఏ కొద్దిగానో లాభమేగాని నష్టం ఉండబోదని వాళ్ళెనాడో గ్రహించేశారు. ఈ అభిమానుల సమక్షంలో అతడి హోదా అతని కళకు చేసిన ఉపకారం ఆ వూరు కాలేజీ ప్రిన్సిపాల్ (కారు ఉన్నవాడు కనుక ఖైర్ల అవసరం ఉన్నవాడు) ముకుందరావుని పిలిపించి పిల్లలకు "లలిత కళలు - వాటి ప్రయోజనాలు" గురించి ఉపన్యాసం యిప్పించాడు. అది ముకుందరావుకి చిరకాలం ఊహాపథంలో మిగిలిన అపూర్వ అనుభవం. ఇది అతని ఔదార్యం కారణంగా అతని కళకు దక్కిన గౌరవం.

అతనికి వరుసగా ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. వాళ్ళకి కళ, చిత్ర, రేఖ అన్న పేర్లే పెట్టాడు ముకుందరావు. వాళ్ళకు చిన్నతనం నుంచీ మంచి మంచి గౌన్లు కుట్టించి వాటి రంగుల దగ్గర్నుంచి, పేటర్న్ ల వరకూ తనే డిజైన్ చేశాడు. అతని పిల్లలు చిత్రకారుడి కుంచెతో తీర్చిదిద్దిన రంగు చిత్రాల్లాగ ఎప్పుడూ కనిపించేవారు. అతనికి నలభయ్యో పడిదాటగానే ఊరుకు కాస్త అవతలగా 4 గ్రౌండ్ల స్థలం కొని ఇల్లు కట్టి చుట్టూ తోట వేశాడు. ఆ యింటికి "కళానిలయం" అని పేరు పెట్టాడు. ఒక మూలన చిన్న కుటీరం వేశాడు. ఆ కుటీరంలో చిలకల పంజరం, మరొక పక్క తేనె పట్టు ఏర్పాటు చేశాడు. అతని కళారాధన అంతా యిప్పుడు ఆ కుటీరానికి బదిలీ చేశాడు. ఈ విధంగా కళ అతని జీవనాన్ని అలంకరించింది.

అతని బలహీనతని (లేదా బలాన్ని) కనిపెట్టిన యువకుడు అతని పెద్ద కూతురు చాలా అందంగా ఉంటుందని గ్రహించి, ఆమెను చూసి రూఢీ చేసుకుని అతని కళ మీద వరుసగా నాలుగు వ్యాసాలు రాశాడు. ముకుందరావు ఆ యువకిడి గురించి ప్రత్యేకంగా వాకబు చేసి తెలుసుకుని అతని అభిరుచికీ ముచ్చటపడి తన కూతురునిచ్చి పెళ్ళి చేశాడు. ఆ పెళ్ళికి కళాకారుల్ని, పత్రికలవాళ్ళనీ అందరినీ ఆహ్వానించాడు. ఒక వృద్ధ కళాకారుడికి దుశ్శాలువా కప్పి సత్కరించాడు. క్రమంగా పత్రికా సంపాదకులతో అతని సంబంధ బాంధవ్యాల వల్ల, పరిచయాల వల్ల అడపాతడపా అతని విసర్గ చిత్రాలు, రేఖా చిత్రాలు పత్రికల్లో పడుతూ వచ్చాయి.

ముకుందరావు జీవితంలో ఒకే ఒక్కసారి ప్రేమలో పడ్డాడు. ఒక పేరు మోసిన పత్రికలో ఒక మూలపడిన 'అసుర సంధ్యలో ఏకాంత ప్రేమికుడు' అన్న చిత్రాన్ని చూసి ఒక ఫాన్ హృదయంలో చిరుగంటలు మ్రోగించింది. సహారాలో వర్షపు చుక్కలాగ పరోక్షమైన ప్రశంసని అతని కళపట్ల ప్రకటించిన ఆ అజ్ఞాత వ్యక్తి అతని జీవితంలో జాగృతమైన మార్పుని మేలుకొల్పింది. ఆమె ఉత్తరానికి వెంటనే సమాధానం రాశాడు. వెంటనే తిరుగు సమాధానం వచ్చింది. వెనక్కి తిరిగి చూసేలోగా ఆ ఉత్తరకాండ "యింతింతై వటుడింతై" అన్నట్లు పెరిగి అతని ఆర్టుపట్ల ఆమె గౌరవం అతని పట్ల గౌరవంగా, అభిమానంగా, ఆరాధనగా, ప్రేమగా మారి స్థిరపడింది. ఆమె ఎక్కడో కాన్పూరులో రైల్వేలో స్టెనో. అతను ఆంధ్రాలో కంపెనీ మేనేజరు. వాళ్ళిద్దరూ కలుసుకునే అవకాశం లేదు. ఆమెని తన ఊహల్లో అందంగా అలంకరించాడు. ఆమె లేఖల ద్వారా ఆమె రూపాన్ని కాన్వాసు మీద చిత్రించాడు. ఆమెకు ఆ చిత్రాన్ని పంపినప్పుడు ఆమె సమాధానం రాసింది. "చిత్రం నా రూపం కంటే మీ హృదయాన్ని ఎక్కువగా చాటి చెపుతోంది" అని. జ్యోత్స్నని కలుసుకోవాలన్నీ సంధ్య వెలుగులో యిద్దరూ కూర్చుని కళ గురించీ, కళారాధన గురించీ కబుర్లు చెప్పుకోవాలనీ ముకుందరావు కలలుగనేవాడు. అది అయిదేళ్ళు ఆలస్యంగా నాగపూర్ రైల్వే స్టేషన్‌లో తటస్థించింది. ఒక సారి నాగపూర్ బిజినెస్‌కి వెళ్ళినప్పుడు ముకుందరావు ఆమెకు ముందుగా ఉత్తరం రాశాడు – తనని వీలయితే కలుసుకోమని. అతని ఉత్తరం చూసుకుని ఆమె వచ్చింది. ఆమెను చూసి మొదట నిర్ఘాంతపోయాడు ముకుందరావు. ఆమెకి 45 సంవత్సరాలుంటాయి. జుత్తు బాగా నెరిసింది. ఆమె అందవికారేం కాదు. మధ్య వయస్సు యిచ్చిన ఠీవీ ఆమెలో ఉంది. శరీరం నలుపు. కళ్ళల్లో దయ, దైన్యత, పెద్ద కళ్ళద్దాలు, గొంతు విప్పితే అమృతం. అతని చిత్రాలు ఏ ప్రత్యేకతా లేకుండా అతి సామాన్యంగా ఉండడాన్ని అతని అసమర్థతగా గాక, నిరాడంబరతగా గుర్తు పట్టింది ఆమె. ఆమెలో కనిపించే ఆకర్షణ కూడా నిరాడంబరత అని అతనూ గుర్తు పట్టాడు. అతని అశక్తతకీ, ఆమె సహజ గాంభీర్యానికి ఒక పొంతన కుదిరింది. కళవల్ల కలిసిన యిద్దరూ ఆ కళని మరిచిపోయి ఎన్నో గంటలు అలా కబుర్లు చెప్పుకుంటూ గడిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ప్రాణమిత్రులు కలుసుకొన్నట్లు, ఎప్పటినుంచో వారిద్దరి మధ్య బంధుత్వం ఉన్నట్లు భావించుకున్నారు. ఆమెకి ఒక్కగానొక్క

కొడుకున్నాడు. అతడు డిఫెన్సు ఎకౌంట్సులో గుమాస్తా. ఆమెని చూసి, ఆమెలో అందం లేమిని చూసి ఏమీ ఆశాభంగం చెందలేదు ముకుందరావు. అతను ఊహించిందీ, ఆశించినదీ ఆమె హృదయంలో సౌందర్యాన్ని. అది ఆమెలో ఏమీ లోపించలేదని అతను ముఖతః గ్రహించాడు. ఆ స్నేహాన్ని కోరిక దృష్టితో చూసి మలిన పరచకుండా కేవలం కళాదృష్టితోనే గౌరవించి చిరస్మరణీయం చేసుకున్నాడు. కొడుకు సంగతి విని అతని ఫోటో పంపమన్నాడు. కొడుక్కి కళతో ప్రమేయం లేదుకానీ కళను గుర్తుపట్టే తన రక్తం పంచుకున్న వ్యక్తి అతను. అందుకని అతను ముకుందరావుని ఆకర్షించాడు. అదిగో అలాగ, రెండో కూతురు పెళ్ళి జరిగిపోయింది.

మొదటి మనమవడికి 'కళాధర్' అని పేరు పెట్టాడు. మనవరాలికి 'చిత్రాంగద' అని పేరు పెట్టాడు. వాంగా గురించి ఇర్వింగ్ స్టోన్ రాసిన నవల అతని మనస్సు మీద చెరగని ముద్ర వేసింది. రెండో మనవడికి "వాంగా" అని పేరు పెట్టాడు. అతని అల్లుళ్ళు ఇద్దరికీ మామగారి అభిరుచిని అర్థం చేసుకోవడం, ఆదరించడం అలవాటై పోయింది. జీవితంలో అన్ని అంశాలనూ కళతో ప్రభావితం చేసుకున్న ముకుందరావుకి ఒక్క విషయంలో మాత్రం అసంతృప్తి ఉండిపోయింది. తన పేరు అంత కళాత్మకంగా ఉండకపోవడం. ఎన్నో సంవత్సరాలు ఆలోచించి ఆలోచించి తన పేరు కుదించి "మురా" అన్న పేరుతో చిత్రాలు వేయడం ప్రారంభించాడు.

అతని 48వ ఏట అతన్ని చిన్నతనం నుంచి ఎత్తుకుని పెంచి, ఇంట్లోనే ఉన్న పైడమ్మ అనే పనిమనిషి చచ్చిపోయింది. ఈ సంఘనకి ముకుందరావు బాగా చలించి పోయాడు. అతని శైశవానికి పైడమ్మ చల్లని గుర్తు అతని హృదయంలో పసితనపు ఛాయల్ని ఎప్పటికప్పుడు పచ్చగా మిగిల్చిన వృద్ధురాలు ఆమె. ఆమె బతికిన 'అవుట్‌హౌజ్' గది అలాగే ఉంది. 48 ఏళ్ళ అతని జ్ఞాపకాలకు గుర్తుగా ఆమె తైలవర్ణచిత్రాన్ని వారం రోజుల్లో వేయించి ఆ గదిలోనే వేలాడదీశాడు. ఆ వృద్ధురాలి ముఖంలో ఒక కళాకారుని దైన్యత ఎక్కువగా ప్రతిఫలిస్తుందని ఆ చిత్రాన్ని చూసిన మిత్రులు అన్నారు. తర్వాత కనకమ్మ అనే కొత్త పనిమిషి ఆ ఇంట్లో చేరింది. ఆమెకి 14 ఏళ్ళు కొడుకున్నాడు. వాళ్ళకి – పైడమ్మ గది పక్కన చిన్న గది కట్టించి యిచ్చాడు. కనకమ్మకి అతని అభిరుచులు, అనుభూతులతో ఏమీ సంబంధంలేదు. ఆమె కేవలం పనిమనిషి. అంతే –

రోజులు ఇలా సజావుగా సాగిపోతుండగా ముకుందరావు జీవితంలో అనూహ్యమైన సంఘటన ఒకటి జరిగింది. అతనికి 50 ఏళ్ళు నిండిన సందర్భంగా కొందరు మిత్రులు కలిసి ఢిల్లీలో ఒక సన్మానం తలపెట్టారు. ముకుందరావు ఆ గెశ్చర్‌కి ఉక్కిరిబిక్కిరయిపోయాడు. ముకుందరావు ఇది కోరి తెచ్చుకున్న గౌరవం మాత్రం కాదు. అతని స్నేహశీలత, సౌశీల్యం తెలిసిన మిత్రులు తమంతట తాము ఏర్పాటు చేసిన సత్కారం.

ఆ విషయం చెప్పి అతని అనుమతి కోరడానికి మిత్రులు వచ్చినప్పుడు అతను

కళ్ళుపీళ్ళు పర్యంతం అయ్యాడు. దాదాపు 3 దశాబ్దాల కృషికి ఇది పరాకాష్ఠ అని చలించాడు. డిసెంబర్‌లో సన్మానం. ఏర్పాట్లు ఎప్పటికప్పుడు అతనికి తెలియజేస్తూ వచ్చారు మిత్రులు. నవంబర్‌లో ఒక అర్జెంటు లెటర్ వచ్చింది కార్యకర్తల నుంచి. సభ ఏర్పాట్లకి మూడు వేలు తక్కువ పడుతుందని. మరో ఆలోచన లేకుండా వెంటనే మనియార్డరు చేశాడు ముకుందరావు.

సన్మానానికి ఇంటిల్లిపాదినీ తరలించుకు వెళ్ళాడు. ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు అల్లుళ్ళు, మనవళ్ళు అంతా. శాంతినికేతన్‌లో మూడో కూతురుని చేర్చాడు. ఆమె కలకత్తా నుంచి సరాసరి వస్తానంది. ఇంటిని పనిమనిషికి అప్పగించి అంతా రైలెక్కారు.

సన్మానం బ్రహ్మాండంగా జరిగింది. విచిత్రంగా సభలో ముకుందరావు "కళ" గురించి ఎక్కువ మంది మాట్లాడలేదు. అతని సహృదయత, అతని పట్టుదల, అతని ప్రైవేట్ కంపెనీలో పరిపాలనా నేతృత్వం వీటి గురించి మాట్లాడారు. అతని మీద ఒక అల్లుడు రాసిన వ్యాసం, కళ గురించి నాలుగయిదు వ్యాసాలు, మరో ఇరవై అడ్వర్‌టైజ్‌మెంట్లు ఉన్న ఒక ప్రత్యేక సంచికను కూడా ఆనాటి సభకు వచ్చిన ఒక కేంద్ర మంత్రిగారు విడుదల చేశారు. మంత్రిగారు పేరుమోసిన రాజకీయ నాయకుడు. ఆయన ఉపన్యాసంలో ఇలా అన్నారు. "ఈయన ఆర్టిస్టని నాకు తెలీదు. కాని ఈయన్ని అభిమానించే మిత్రులున్నారని తెలుస్తోంది. ఆర్టు గురించి నాకు తెలియదు. కాని ఆర్టుని 30 సంవత్సరాలు నమ్ముకుంటే ఢిల్లీలో సన్మానం దాకా ప్రయాణం చెయ్యొచ్చునని తెలుస్తోంది. నేను చిన్నతనం నుంచి రాజకీయాల్ని నమ్ముకుని ఢిల్లీ వచ్చాను. ఈయన కళను నమ్ముకుని ఈవాళ ఢిల్లీ వచ్చారు. ఇదే అభివృద్ధి."

సన్మానం ముగిశాక అంతదూరం ఎలాగూ వెళ్ళారు గనక ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, చండీఘర్, పింజోరా గార్డెన్స్ అన్నీ తిరిగి 15 రోజుల తర్వాత సకుటుంబంగా ఇల్లు చేరుకున్నాడు ముకుందరావు. అతని జీవితంలో సన్మానం ఒక మైలురాయి. అయినా ముకుందరావు అలసిపోలేదు. తిరిగి వస్తూనే తన కృషిలో నిమగ్నమయ్యాడు. ఓ ఆదివారం చాలా రోజుగా పేరుకు పోయిన డ్రాయింగుల్ని పెడమ్మ చిత్రం అవుట్ హౌస్‌లోకి చేర్చాలని కూర్చున్నాడు. ప్రచురితమయిన వాటి కంటే ప్రచురితం కానివే ఎక్కువ ఉన్నాయి. తీరిక సమయంలో అవి చూసుకుని, అవి వేసుకున్నప్పటి జ్ఞాపకాన్ని గుర్తు చేసుకుని ఆనందపడటం అతనికి ఆనవాయితీ. ఈ ఆదివారం కొత్త దొంతరని బీరువాలో చేర్చడానికి అవుట్ హౌస్ గదిలో ఉంచిన బీరువా తెరిచాడు. తెరవగానే అతని గుండె ఓ క్షణం ఆగిపోయింది. అక్కడ ఉండవలసిన వంద చిత్రాల దొంతర్లు కనిపించలేదు. అతని రక్తస్రావం క్షణకాలం ఆగిపోయింది. తన కళ్ళముందే తన గతాన్ని చెరిపేసినట్టు విలవిలలాడి పోయాడు.

బయటకు పరుగున వచ్చి పనిమిషిని పిల్చాడు. ఎప్పుడూ గొంతెత్తి మాట్లాడని అతని గొంతువిని భార్యా, పిల్లలు, అల్లుళ్ళు అందరూ వచ్చారు. బీరువా ఖాళీగా ఉండడం చూసి అంతా బిక్కచచ్చి పోయారు. ఎవరికీ నోట మాటరాలేదు. పెద్దల్లుడు మాత్రం

కఠినంగా కనకమ్మని గద్దించాడు. అందులో కాగితాలన్నీ ఏమయ్యాయి? అని ఆమెని నిలదీసి అడిగాడు.

మొదట కనకమ్మ తనకేమీ తెలియదని బుకాయించింది. తనని అనుమానిస్తున్నందుకు నిష్ఠూరాలు పలికింది. చివరికి భోరుమంది. అప్పుడు నిజం చెప్పింది. కొడుకు ఎస్సెల్సీ పరీక్ష జీతం కట్టడానికి డబ్బు కావలసి వచ్చింది. డబ్బు యిచ్చేవాళ్ళు ఎవ్వరూ కనిపించలేదు. ఏం చెయ్యాలో తెలీక పిచ్చిదానిలాగ కనిపించిన వారందరినీ సహాయం చెయ్యమని అడిగింది. చివరికి బీరువాలో దుమ్ము పట్టి ఎర్రబడిపోతున్న కట్టలు కనిపించాయి. చిత్తుకాగితాల వాడికి అమ్మగా 52 రూపాయలు వచ్చాయి.

ఒక జీవితకాలం ముకుందరావు జీవితాన్ని ప్రభావం చేసిన కళ ఒక కుర్రాడి పరీక్ష జీతానికి సరిపోయింది. ఇంత సమగ్రమయిన కృషిని ఇంత చిన్న ప్రయోజనానికి కుదించవచ్చునన్న ఆలోచనతో అతని మనస్సు రాజీ పడలేదు. కళ అంత సంకుచితమయిన ప్రయోజనానికి తాకట్టు పెట్టడం అతను భరించలేకపోయాడు. కళాసాధనలో ఆవలి గట్టుకి చేరగలిగినప్పుడు కళాకారుడి లక్ష్యం సిద్ధించిన తృప్తితో నిట్టూరుస్తాడు. కాని కళాసాధనను అంత చిన్న ప్రయోజనానికి కుదించినప్పుడు? తిన్నగా తన పడకగదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు ముకుందరావు.

తెల్లవారేసరికి మంచం మీద చచ్చిపోయి ఉన్నాడు. నిద్దరలోనే ప్రాణం పోయిందన్నారు డాక్టర్లు.

కాస్త ఆలస్యంగా మరో పత్రికలో ఈ చిన్న ప్రకటన వేశారు.

"ముకుందరావు కళకి ఏం సేవ చేశాడో తెలీదు కాని అతని జీవితం కళాత్మకం చేసుకున్నాడు. కళ అతని వ్యక్తిత్వాన్ని అందంగా తీర్చిదిద్దింది. అతని మరణానికి డాక్టర్లు చెప్పిన కారణం 'ఆర్టు ఎటాక్!'

'హా'కి బదులు 'ఆ' అన్న అచ్చు తప్పుని సంపాదకుడు మర్నాడు కనిపెట్టాడు. కాని దాన్ని సవరించవలసిన అవసరం కనిపించలేదు. అతనికి ముకుందరావు గురించి తెలుసు. అచ్చు తప్పుకి అందమైన పరమార్థం సాధించింది ఒక్క ముకుందరావు విషయంలోనే అనుకుని నవ్వుకున్నాడు.

———